Truth of News

RNI NO : APTEL/25/A0239

సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 290 | గురువారం 07 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

భారత్‌లో వియత్నాం అధ్యక్షుడు పర్యటన

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం:

వియత్నాం అధ్యక్షుడు టో లామ్ భారత మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. టో లామ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో అధ్యక్షుడు అయిన తర్వాత భారత పర్యటన ఇదే తొలిసారి. నేడు రాష్ట్రపతి భవన్‌కి చేరుకున్న వియత్నాం అధ్యక్షుడికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ ఘన స్వాగతం పలికారు. నేడు టో లామ్, మోడీ ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించుకోనున్నారు.

- మిగతా 3లో..

ఎన్నికల రణంలో... విభిన్న కోణం..!!

- బెంగాల్ దంగల్ ఇంకా గరం గరం..
- రాజీనామాకు మమతా బెనర్జీ ససేమిరా..
- వెంటాడుతున్న కమ్యూనిస్టుల శాపం..
- తమిళ నాట సరికొత్త రాజకీయ బాట..
- ద్రవిడ ఫార్ములకు మూడో ప్రత్యామ్నాయం..
- పుదుచ్చేరి సీఎంగా ఐదో మారు ఆమాద్మీ..

మహమ్మద్ షఫీ అహ్మద్,
సూర్యవాస్తవం - ప్రత్యేక ప్రతినిధి

ఎట్టకేలకు దేశీయుల్లో ఐదు రాష్ట్రాల ఎన్నికల ఉత్కంఠ వీడింది. తీవ్ర ఆసక్తిని రేకెత్తించిన ఆయా రాష్ట్రాల ఫలితాలు, భవిష్యత్ భారత్ దర్శనానికి ప్రతీకగా నిలిచాయి. యావత్ భారతంలో మిక్కిలి ఆసక్తి రేకెత్తించిన, ఆ ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు నాంది పలకనున్నాయి.

తమిళనాడు.. కేరళ ఫలితాలు అధికార మార్పిడికి దోహదపడినప్పటికీ, కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు అధికార దాహానికి.. రాజ్యవిస్తరణ కాంక్షకు పశ్చిమ బెంగాల్ ఫలితాలు.. ముంజేతి కంకణానికి నిదర్శనంగా నిలిచాయి.

తాజా ఫలితాలు ఏతా, వాతా మరో మారు భాజాపా ఎన్నికల ప్రభంజనాన్ని చాటినా.. దక్షిణాదిన పాతుకుపోయిన ద్రవిడ పార్టీల పాత ఫార్ములాకు కొత్త రూపానిచ్చాయి. మలబారు తీరంలో అధికార మార్పిడికి అవకాశ మిచ్చినా.., యుడీఎఫ్‌కు తిరుగులేని శక్తిగా నిలబెట్టాయి. ఎన్డీఏకు దీటైన ప్రత్యామ్నాయానికి తిరుగులేని సారథిగా విపక్ష నేత రాహుల్ గాంధీని సూచించాయి. హాట్రిక్ సీఎంగా బెంగాల్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని చలాయిస్తూ వస్తున్న బెంగాల్ టైగర్ మమత స్పీడుకు అంతే స్థాయి బ్రేకులు వేశాయి. అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ పాలన నల్లేరుపై నడకగా తేల్చిచెప్పాయి. బెంగాల్‌లో 15ఏళ్ల తృణముల్ పాలనను మట్టికరిపించేందుకు కేంద్రంలోని అధికార ఎన్డీఏ సర్కారు 'సర్' అస్త్రాన్నే ప్రధాన శస్త్రంగా బరిలోకి దించింది. ఎన్నికల ప్రకియలో భాగస్వాములైన రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ నియంత్రిస్తూ .. ఏకపక్షంగా శాసిస్తూ .. మమతా బెనర్జీని ఈ మారు అధిపీఠానికి దూరం చేసి,తన నిర్దేశిత లక్ష్యానికి చేరువైంది.

ద్రవిడ పార్టీల ఫార్ములాకు ప్రత్యామ్నాయం:

దక్షిణాదిన తమిళ నేలపై తాజా ఫలితాలు అక్కడ ద్విముఖ ఆధిపత్యం చలాయిస్తున్న ద్రవిడ పార్టీలకు ప్రత్యామ్నాయం చూపాయి. సీనీ హీరో దళపతి విజయ్‌పార్టీ టీవీకే అధికారం చేజిక్కించుకోవడం దక్షిణాది రాజకీయాల్లో శుభ సంకేతం కానుంది. సుదీర్ఘ కాలం అనంతరం, 1977 తరువాత ఎం.జీ.ఆర్., ఎన్టీఆర్ తరహాలో ఓ సినీ హీరో పార్టీ పెట్టిన స్వల్ప వ్యవధిలో అధికారం పీఠం కైవసం చేసుకోవడం ఇటీవలి దేశ రాజకీయాల్లో ఇదే ప్రథమం. ఈ ప్రయోగం తెలుగురాష్ట్రాల్లో రాజకీయ శూన్యతకు చక్కని పరిష్కారంచూపింది. ప్రత్యేకించి ఆంధ్ర రాష్ట్రంలో కేంద్ర ఎన్డీఏ సర్కారుకు కుడి,ఎడమ భుజాలుగా వ్యవహరిస్తున్న, విరుద్ధ పార్టీలకు మింగుడు పడని అవకాశానికి కొత్త దారి కనిపెట్టాయి.

స్నేహపూర్వకంగా కేరళలో అధికార మార్పిడి

కేరళలో యూడీఎఫ్ అందలానికి ఎగబాకడంతో, వామపక్ష ఎల్.డీ.ఎఫ్.కూటమి అధికారం పీఠం నుంచి జారినా నేలబారున నిలిచే అవకాశాన్ని అక్కడి ఫలితాలు మిగిల్చాయి. ఎన్డీఏ కూటమి ఒకటి,అర సీట్ల తోనే సర్దుకు పోయే అగత్యం ఏర్పడటంతో, కేరళలో వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తుల ఉనికికి భరోసా ఏర్పడింది. అత్యంత అక్షరాస్యులు..మేధావులున్న ఆ రాష్ట్రం విద్వేష శక్తులకు తమవద్ద చోటు లేదనే స్పష్టమైన సంకేతానిచ్చింది. ప్రజాస్వామ్య విలువలకు లోబడి స్నేహ పూర్వక పోటీ నేపథ్యంలో..

- మిగతా 2లో..

బీజేపీలో ప్రతి ఆరవ ఎంపీ ఓటు చోరీతోనే గెలిచారు

- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం: లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బుధవారం బిజెపిపై తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి ఎంపీలు ఓట్ల చోరీతోనే గెలిచి పార్లమెంటుకి వెళ్లారని ఆయన ఆరోపించారు. బిజెపిలోని ప్రతి ఆరవ ఎంపి ఓట్ల చోరీతోనే ఎన్నికల్లో గెలిచారని రాహుల్ విమర్శించారు. 'ఓట్ల దొంగతనం ద్వారా కొన్నిసార్లు వ్యక్తిగత సీట్లను, మరికొన్నిసార్లు ఏకంగా ప్రభుత్వాన్నే దొంగిలిస్తారు. లోక్‌సభలో ఉన్న 240 బిజెపి ఎంపీల్లో దాదాపు ప్రతి ఆరవ ఎంపి ఓటు చోరీ ద్వారా సీటు దక్కించుకున్నారు' అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. కాగా, అలాంటి ఓటు చోరీకి పాల్పడే వారిని గుర్తించడం కష్టమేమీ కాదు.

- మిగతా 3లో..

ప్రజలను ఇబ్బందిపెట్టకండి

- డీజీపీకి సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ప్రజలను రోడ్లపై గంటల తరబడి నిలబెట్టవద్దన్న రేవంత్ రెడ్డి
- కాన్వాయ్ వెళ్లే దారితో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను ఆపేసి ఇబ్బంది పెట్టవద్దన్న సీఎం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ కమిషనర్లకు డీజీపీ సూచన - కాన్వాయ్ వెళ్లే సమయంలో సింగిల్ లైన్‌గా విభజించి వాహనాలను పంపించాలన్న డీజీపీ

3పే

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

విశాఖలో రూ.లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్

- సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్
- కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు
- తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ పరిశ్రమ
- ఎస్ఐపిబి సమావేశంలో నిర్ణయాలు

అమరావతి - సూర్య వాస్తవం

విశాఖపట్నంలో లక్ష కోట్ల రూపాయలతో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయ నుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (స్టేట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ బోర్డ్ -- ఎస్ఐపిబి) సమావేశంలో ఈ మేరకు ఆ సంస్థ నుండి అందిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. 1,08,010 కోట్ల రుపాయలతో విశాఖలో డేటా సెంటర్‌ను, సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను ఏర్పాటు చేయడానికి కూడా ఆర్ఐఎల్ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అదే విధంగా కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి లభించింది. మొత్తంమీద

- మిగతా 3లో..

సంపద, పరిపాలన అందరికీ సమానంగా పంచాలి

- సామాజిక న్యాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

మైసూరు- సూర్య వాస్తవం

ఆర్థిక, సామాజిక బలానికి విద్య అవసరమని, భోవి సమాజం చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. కన్నడ, సాంస్కృతిక శాఖ, మైసూరు జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన సిద్ధరామేశ్వర జయంతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి ప్రభుత్వం

- మిగతా 3లో..

ఎన్నికల రణంలో విభిన్న కోణం..!!

(మొదటిపేజీ తరువాయి)

ఎల్డీఎఫ్ నుంచి యూడీఎఫ్‌కు అధికార బదిలీ జరిగిందే కాని, దేశ సుస్థిరత,సమగ్రత,ఐక్యత,లౌకికత్వ విలువలకు రెండు కూటములు సారూప్య సంఘటనతో ముందకు సాగుతాయని నమ్మకాన్ని కల్గించాయి. అస్సాంలో కమలం పార్టీ ప్రస్తుత సీఎం హిమంత్ బిశ్వశర్మ సారథ్యంలో హ్యాట్రిక్ నమోదు చేసింది. ఎన్డీఏ అధిష్ఠానం మనసెరిగి బిశ్వశర్మ త్రిబులింజన్ ఫార్ములాతో.. ముచ్చటగా మూడే సారి 'కమలాన్ని' అస్సాం పీఠంపై ఎక్కించారు. సంక్షేమం,గుర్తింపు,కాంగ్రెస్ విచ్ఛిన్నం.. ఆయనకు అండగా నిలిచింది. ముందస్తు అంచనాలు నిజం చేస్తూ పుదుచ్చేరి మళ్లీ ఎన్డీఏ ఖాతాలోకి చేరింది. అక్కడ ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ అధినేత 'ఆమ్ ఆద్మీ రంగస్వామి' ఐదో పర్యాయం సీఎం కానున్నారు.

దేశ వ్యాప్తంగా బెంగాల్ దంగల్ సంచలనం

దేశ వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠ, ఉద్విగ్నం, ఉద్వేగం కల్గించినప్పటికీ.. బెంగాల్ ఎన్నికల ఫలితాలే.. దేశ రాజకీయాల్లో పెను దుమారం సృష్టిస్తున్నాయి. 15 ఏళ్లుగా బెంగాల్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని చలాయించిన టీఎంసీ పార్టీని కాదని ఓటర్లు కమలం పార్టీకి పీఠం ఎక్కించారు. బెంగాల్ నుంచి కమ్యూనిస్టు పార్టీలను తరిమిన నేతగా ముద్రపడ్డ మమతా బెనర్జీ తన పార్టీ ఓటమిని అంగీకరిం చేందుకు సిద్ధ పడటం లేదు. లక్షలాది సాయుధ బలగాల పర్యవేక్షణలో బెంగాల్‌లో దశల వారీగా జరిగిన ఎన్నికల్లో.. రాజ్యాంగ వ్యవస్థలన్నీ ఏకమై తన పార్టీని పరాజయం పాలు చేశాయని ఆమె ఆరోపిస్తున్నారు.మమత విమర్శలకు తగ్గట్టుగానే తృణమూల్‌ను భూస్థాపితం చేసేందుకు కమలం పార్టీ రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ విరివిగానే వినియోగించిందనడంలో సదేహమే లేదు.

పంతం పట్టి ఓడించిన రాజ్యాంగ వ్యవస్థలు

ఇసీ,ఇడీ,సీబీఐ, వంటి సంస్థలు,మరో వైపు గోదీ మీడియా.. మమత ఓటమికి పంతం పట్టి మరీ ఓ వైపు మొగ్గాయి. ఎన్నికల ముందు నాటి ఉద్రిక్త,ఉద్విగ్న పరిస్థితులు ఫలితాలనంతరం కూడా అక్కడ ఇంకా కొనసాగుతున్నాయి. గతంలో మాదిరిగానే అక్కడ రాజకీయ,దాడులు ప్రతి దాడులు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నికల ప్రకియలో అలసి సొలసిన పార్టీలు, ప్రతీకారం కోసం కాకుండా ప్రగతి దిశగా అడుగులు వేయాలని అక్కడి పార్టీ శ్రేణులకు ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా ఇచ్చిన పిలుపును.. కమలం శ్రేణులు ఖాతరు చేయడం లేదు. ఇప్పటి వరకూ అధికారం దాహంతో అల్లాడిన క్యాడర్, ప్రతి దాడులకు పాల్పడుతోందనే విమర్శలు వినవస్తున్నాయి. అక్కడి ఎన్నికల హింసను అంచనా వేసిన ఎలక్షన్ కమిషన్, ఆ ప్రక్రియను గాడిలో పెట్టేందుకు రెండున్నర లక్షల సాయుధ బలగాలను ముందుగానే బెంగాల్‌లో మోహరింప చేసింది. కేంద్ర బలగాలు శాంతి భద్రతల పునరుద్ధరణకు వీసమెత్తు సహకారం అందించడం లేదని,ఏక పక్ష దాడులకు ఊతమిస్తున్నాయని టీఎంసీ శ్రేణులు గగ్గోలు పెడుతున్నాయి. ఎన్నికల తంతు ముగిసినా 70 వలకు పైగా కేంద్ర బలగాలు బెంగాల్‌లోనే ఇంకా తిష్ట వేయడంలో పరిస్థితిని అంచనా వేయవచ్చు. ఎన్నికల అనంతరం ఆ రాష్ట్రంలో చెలరేగిన హింసకు, తమపార్టీకి సంబంధం లేదని కమలం నేతలు బుకాయిస్తున్నా.. ఓ పథకం ప్రకారం ప్రతీకార దాడులు చోటు చేసుకుంటున్నాయని క్షేత్ర స్థాయి పరిస్థితులు చెబుతున్నాయి.

ఆగ్రహ జ్వాలల్లో టీఎంసీ కార్యాలయాలు:

అందుబాటులో ఉన్న టీఎంసీ కార్యాలయాలకు ప్రత్యర్థులు నిప్పు పెట్టడంతో పాటు, ఆ పార్టీ క్రీయాశీలక నేతలను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడుతున్న వార్తలు సోషల్ మీడియాను కుదిపేస్తున్నాయి. స్వయంగా మాజీ ముఖ్యమంత్రి టీ.ఎం.సీ అధినేత్రి మమతా బెనర్జీ సైతం తనపై కౌంటింగ్ కేంద్రంలో భౌతిక దాడి జరిగిందని, కేంద్ర బలగాలు అప్పుడు ప్రేక్షక పాత్ర పోషించాయని ఆరోపిస్తున్నారు. అధికారిక వ్యవస్థనుంచి తనను తప్పించే ప్రయతాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలు విజయవంతంగా అమలు పర్చాయని విమర్శిస్తున్నారు. వందకు పైగా కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లూటీ జరిగిందని.. తన విజయాన్ని అపజయంగా చూపే కుట్ర విజయవంతంగా అమలైందని ఆరోపిస్తున్నారు. ఆమేరకు ఆపార్టీ శాసన సభ్యురాలు సగారికా ఘోష్..70 కేంద్రాల్లో జరిగిన అక్రమాలపై సాధికారతా గణాంకాలు, ఆధారాలను ప్రసార మాధ్యమాలకు చేరవేశారు. ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకు కౌంటింగ్ రౌండ్లను తన అధికారికి వెబ్‌సైట్లో నమోదు చేయక పోవడాన్ని ఆమె ప్రశ్నిస్తున్నారు.

మమత మండిపాటుకు రాహుల్ సమర్థన:

లోకసభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సైతం మమతా బెనర్జీ ఆరోపణలను సమర్థించారు. తృణమూల్ ఓట్ల లూటీపై సుప్రీం కోర్టు ప్రఖ్యాత న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్..,కపిల్ సిబల్ తదితరులు వేర్వేరుగా తమ తమ ట్వీట్లలో ప్రస్తావించారు. టీఎంసీ బీజేపీతో తలపడనేలేదని, కేంద్ర సంస్థలు, ఇసీ,ఇడీ,సీబీఐ, కూడ బల్కుకొని ఆమెను ఓడించాయిని పేర్కొన్నారు. సమాజిక వేత్త యోగేంద్ర యాదవ్ సైతం బెంగాల్ ఎన్నికల ప్రకియను ఓ ప్రహసనంగా ఖరారు చేశారు. రాజ్యాంగ వ్యవస్థలన్నీ కల్సి ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేశాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లపై బీరాలు పలికే కమలం పార్టీ, ఓ మహిళా సీఎంను అప్రజాస్వామికంగా అణిచి వేసిందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులు బెంగాల్ ఎన్నికల ప్రహసనంపై ఇదే తరహా వాదన చేస్తున్నారు. అధికారం చేజారిన ఇతర రాష్ట్రాల సీఎంల మాదిరిగా దీదీ తన ఓటమిని అంగీకరించేలా లేరు. తమిళనాడు ముఖ్యమంత్రిగా ఓటమిపాలైన టీజే స్టాలిన్ రాష్ట్ర ప్రజల తీర్పును శిరసావహిస్తామని, ఓటమిని గౌరవిస్తామని, బాధతాయుత ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని ప్రకటించారు. ఆకలి,పేదరికాన్ని నిర్మూలించిన తొలిరాష్ట్రంగా నమోదైన కేరళ సీఎం పినరయి విజయన్ సైతం ఓటమిని స్వచ్ఛందంగా అంగీకరించి ముందస్తు రాజీనామా ప్రకటించారు. అన్నింటా అభివృద్ధి నమూనాతో ఎల్.డీ.ఎఫ్‌కు రెండు మార్లు సీఎం సారథ్య బాధ్యతలు వహించిన విజయన్ తమ ఓటమిని స్వాగతించారు. ఈ అంశపై మమత అంత తేలికగా రాజీ పడేలా లేరు.

ఓటమి చెందినా రాజీనామాకు దీదీ ససేమిరా..

బెంగాల్ దీదీగా 15 ఏళ్ల సుదీర్ఘ పాలన సాగించిన మమత బెనర్జీ.. రాజ్యాంగ వ్యవస్థల బాధ్యతరాహిత్యాన్ని, వైఫల్యాన్ని, పక్షపాతాన్ని సాకుగా చూపి తన ఓటమిని అంగీకరించేందుక సిద్ధ పడటం లేదు. ఇసీ.,ఈడీ.,సీబీఐ, వంటి రాజ్యాంగ వ్యవస్థలు తమ పార్టీ ఓటమికి కంకణం కట్టుకున్నాయని..ఓడించి తీరాలనే పంతంతో..అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయని వాదిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో తనను అక్రమంగా నిర్బంధించి ఓట్ల లూటీ జరిగిందని,వందకు పైగా స్థానాల్లో తమ పార్టీ ఓట్లు గల్లంతయ్యాయని విమర్శిస్తున్నారు.తనదే అసలు సిసలైన విజయమని బెంగాల్ యావత్తు తమ వెంటే ఉందన్న ధీమాతో సీఎం పదవికి తన రాజీనామాను నిరాకరిస్తున్నారు. 2019లో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు సైతం ఓటమి అనంతరం.. ఇదే తరహాలో రాజీనామాకు నిరాకరించారు. గవర్నర్ కార్యాలయం జోక్యంతో అప్పట్లో పరిస్థితి సర్దుబాటు జరిగితే..అప్పట్లో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా మే 30న జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇదే తరహా రాజ్‌భవన్ జోక్యం బెంగాల్‌లో అనివార్యంగా కనిపిస్తుంది. మరో వైపు మమతా తాను రాజ్‌భవన్‌కు వెళ్లేది లేదని ఖరాఖండిగా చెపుతున్నారు. కేంద్రం లోని అధికార ఎన్డీఏ ప్రభుత్వం వ్యవస్థల దుర్వినియోగం విష యమై సంజాయిషీ ఇచ్చుకునే ప్రయత్నం ఏదీ చేయనప్పటికీ బెంగాల్ దంగల్ ఆరంభానికి ముందునుంచే అక్కడ ఎన్నికల వ్య వస్థ ప్రహసనంగా మారిన అంశమై ప్రత్యేక చర్చ అవసరం లేదు.

దేశ వాసుల పరిశీలనలో బెంగాల్ దంగల్ :

దేశం యావత్తు బెంగాల్ ఎన్నికల ప్రక్రియను తొలి నుంచి గమనిస్తూ వస్తూనే ఉంది. ఎన్నికల కమిషన్ బెంగాల్‌లో ముందస్తుగా అమలు పర్చిన సర్ ప్రక్రియ దుమారం ఏపాటిదో తెలియనిది కాదు. స్పెషల్ ఇంటెన్సి రివిజన్ సాకుగా ఆ రాష్ట్రం మొత్తం మీద 91లక్షల పై చిలుకు ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయరనే వాదనకు ఆధారాలున్నా.. ఎన్నికల కమిషన్‌తో పాటు, న్యాయ వ్యవస్థల నిష్క్రియా ప్రియత్వం ఏపాటిదో దేశ వాసులందరికీ తెలియవచ్చింది. 27లక్షల ఓట్ల గల్లంతుపై ఆధారాలతో సహా దేశ అత్యున్యత న్యాయస్థానాన్ని, బాధితులు ఆశ్ర యించినా.. ప్రస్తుతాన్ని మినహాయించి, ఓటు హక్కు అవకాశాన్ని భవిష్యత్ ఎన్నికలకు ముడిపెట్టడం.. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు జరిగిన కృషికి నిలువెత్తు నిదర్శనమనే చెప్పాలి. చిరకాలంగా ఉన్న ఓటు హక్కును కోల్పోయిన యావ న్మంది.. దివంగతులో,చచ్చి సర్గంలో ఉన్నవారోకాదు., అక్రంగా రాష్ట్రంలో చొరబడుతున్న బంగ్లాదేశీయులు అంతకంటే కాదు., బెంగాల్ గడ్డపై పుట్టి..పెరిగి..తాజా ఎన్నికల నాటికి అందరూ సజీవంగా ఉన్నవారే.. లక్షల సంఖ్యలో జనాలు తమ ఓటు హక్కు ను ప్రసాదించమని మొరపెట్టుకుంటే .. రెండో విడత పునరు ద్ధరణలో కేవలం, 1608 మందికి మాత్రమే తిరిగి ఓటు పొందే మహద్భాగం దక్కిందనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు.

జవాబుదారీతనం కొరవడిన రాజ్యాంగ వ్యవస్థలు

ఎన్నికల ప్రకియను అమలు పర్చే అధికారులకు సైతం, సర్ ప్రక్రియ ఓటు హక్కును దూరం చేసిందనే ఆధారాలున్నా.. సరిదిద్దలేదని జవాబు దారి తనాన్ని రాజ్యాంగ వ్యవస్థలు ప్రదర్శించాయి. నిన్న మొన్నటి బీహార్ ఎన్నికల ముందు వరకు దేశంలో ఏ స్థాయి ఎన్నికలు జరిగినా పాలకపక్షం బీజేపీ ఎన్నికల లబ్ధికి ప్రయోగించే అస్త్ర, శస్త్రాలు ఏ తరహాకు చెందినవో..దేశ ప్రజలకు తెలియని విషయాలు కావు. సరిగ్గా ఎన్నికల ముందు నాటి సంఘటనలు,దుర్ఘటనలు ఎందుకు చోటు చేసుకునేవో.. దేశ వాసుల నోళ్లలో తరుచూ నానుతున్న అంశాలే. వీటన్నింటికీ భిన్నంగా ఐదు రాష్ట్రాల తాజా ఎన్నికలకు ముందు నుంచి, ఎన్డీఏ ప్రభుత్వం 'సర్' పేరుతో సరికొత్త అస్త్రాన్ని సానపెట్టి బెంగాల్ ఎన్ని కల్లో లక్ష్యం దిశగా సంధించింది. రాజ్యాంగ వ్యవస్థలు, ఏకీకృత అధికారం ఓ పక్క చేరిపోయి.. ఎన్నికల ప్రకియను ఏక పక్షంగా శాసించే పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు, బెంగాల్ తరహా ఫలితాలను ఊహించడం ఎంతమాత్రం అత్యాశ అనిపించుకోదు. వ్యవస్థలు, అధికార సంస్థలు ఏకమై గెలుపోటములు శాసించే స్థాయికి చేరినప్పుడు, ఆయా వ్యవస్థల తాలూకు తప్పిదాలన్నీ కనుమరుగై.. ఆదేశిత ఫలితాలకే అందలం దక్కుతుంది. ఆశ్రిత పక్షానికే అధికార పీఠం చేజిక్కుతుంది. రాజకీయాల్లో తలపండిన తృణ ముల్ అధినేత్రి మమతా బెనర్జీకి ఈ విషయాలు తలియవనికాని, కాలగతిలో ఒత్తిడిలు..విస్మరించేలా చేశాయని భావించలేం.

శివంగిలా శివాలెత్తుతున్న మమతా బెనర్జీ

2011నాటి నందిగ్రామ్, సింగూర్ భూసేకరణకు వ్యతిరేకంగా వామపక్ష ప్రభుత్వంతో శివంగిలా హోరాహోరీతల పడిన దీదీ..తాజా అవమానాన్ని,పరాభవాన్ని అంత తేలికగా తీసుకుంటారని భావించలేం.

అందుకే ఆమె రాజీనామాకు సిద్ధ పడకుండా మొండికేస్తున్నారు. అవకాశ మున్న దార్లన్నీ వెతికి కేంద్ర సర్కారు ఒంటెద్దు పోకడలపై కత్తి దూసేందుకు సిద్ధ మవుతున్నారు. వందకు పైగా కేంద్రాల్లో తమ అభ్యర్థుల ఫలితాలు లూటీ జరిగాయన్న ఆమె వాదనకు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తోంది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారును అన్నింటా దునుమాడుతున్న విపక్ష నేత రాహుల్ గాంధీ మమతా ఆరోపణలకు వత్తాసు పలకండం ఆమెకు ఊరడింపు మాత్రమే కాదు.., రానున్న రోజుల్లో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్య పరిచే శక్తులకు వ్యతిరేకంగా పోరాడితే, అందుకు విపక్షనేతగా తమ అండదండలుంటాయనే భరోసాను కల్గించడమే. ఎన్నికల ఓటమి జీర్ణించలేనిదే ఐనప్పటికీ మమతా దీదీ ఊరుకునే లా లేరు. రాజ్యాంగ వ్యవస్థల వ్యతిరేకతను దీటుగా ఎదుర్కొంటూనే.. తనపై, తనవారిపై సాగుతున్న దాడులకు వెరవెక.. కేంద్రంలోని అధికారికి వ్యవస్థకు బెదరక ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవాలని అమీతుమీకి సిద్ధ పడటం ప్రస్ఫుటంగా కానవస్తుంది.

బెంగాల్‌లో బీజేపీ మొలకకు మమత అంకురార్పణ:

మమతా బెనర్జీ పోరాట పటిమకు దేశ వ్యాప్తంగా సానుకూలత ఉన్నప్పటికీ, వాస్తవానికి బెంగాల్‌లో బీజేపీ మొలకకు మమత ద్వారానే తొలి అంకురార్పణ జరిగింది. ప్రజాస్వామ్యం,లౌకిక వాదం,శ్రేయోరాజ్యం లక్ష్యాలకు పాడె కట్టడానికి.. యువజన కాంగ్రెస్ బహిష్కృత నేతగా.., కాంగ్రెస్‌పై మంటతో ఆమె కమలంతో జతకట్టారు. ప్రధానిగా వాజపాయి ఎన్డీఏ టూ హాయంలో రైల్వే మంత్రి పదవి పొంది కమ్యూనిస్టు పాలనకు వీలైనన్న అడ్డంకులను కల్పించారు. మమతతో జతకట్టిన ధీమాతో, కాంగ్రెస్ వ్యతిరేకత ఆసరాగా.. కమ్యూనిస్టుల కంచుకోటల కూల్చివేతకు బీజేపీ గోతులు తవ్వడం ప్రారంభించింది. డిఫెన్స్ స్కాం నేపథ్యంలో.. తెహల్కా స్టింగ్ ఆపరేషన్ సాకుగా మమత బీజేపీతో విభేదించి 2001లో ఎన్డీఏను వీడారు. ఆపై తిరిగి మనసు మార్చుకొని.. 2003లో వాజ్‌పేయి ప్రధాని హయాంలో ఎన్డీఏకు చేరువై.. మరోమారు కేంద్ర మంత్రి వర్గంలో పోర్టు పోలియోలేని మంత్రిగా కొనసాగారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు వ్యతిరేకతలను.. ఒకే మూసలో రంగరించి, ఎన్డీఏ సహకారంతో కమ్యూనిస్టు రహిత బెంగాల్‌కు శ్రీకారం చుట్టారు.. ఆపై అంతటా..అన్నింటా తానై వ్యవహరిస్తూ 2026 వరకు బెంగాల్ టైగర్‌గా కమలం బోనుకు చిక్కారు.

రాజ్య కాంక్షతో సైలెంట్ కిల్లింగ్ ఫార్ములా

బెంగాల్‌లో కమ్యూనిస్టుల అంతర్ధానానికి మమతను చంకనెక్కించుకున్న బీజేపీ.. ఏరుదాటి తెప్ప తగలేసిన ఫార్ములాను మమతా పైనే అమలు పర్చేందుకు సిద్ధ పడింది. రాజ్య కాంక్షతో సైలెంట్ కిల్లింగ్ ఫార్ములాను రహస్యంగా అమలు పరుస్తూ వచ్చింది. అక్కర తీరాక తృణమూల్‌ను కొక్కెరకు ఎక్కించే పనికి శ్రీకారం చుట్టింది. ఆ మిషన్‌లో భాగంగానే ముందస్తు విజన్‌తో 'సర్' ప్రకియను ఆస్త్రంగా మల్చి మమతపై గురిపెట్టింది. 'త్రిబుల్ ఎం' సూత్రం (మమత,మహిళ, ముస్లిం)తో 15 ఏళ్లుగా బెంగాల్‌ను ఏలుతున్న మమత కోటలకు బీటలు వేసింది. 'సర్' ప్రక్రియ మమత సంప్రదాయ ఓటు బ్యాంకు కన్నం వేయడంతో.. ఆదిలోనే లక్షల ఓట్లు గల్లంతైన విషయం బయటపడింది. అయినప్పటికీ అత్యంత సాహసోపేతంగానే మమత ఎన్నికల్లో ఎన్డీఏ ఆగడాలను వ్యతిరేకించారు. తన పట్టు జారకుండా ఎన్నిజాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఎన్డీఏ గండం ఆమెను మరింతగా సుడిగుండంలో నెట్టింది. ఆ రాజకీయ విన్యాసాల్లో భాగంగానే బెంగల్ కమ్యూనిస్టులను ఏమార్చే స్క్రిప్ట్‌ను మమత విజయ వంతంగా అమలు పర్చారు. కమ్యూనిస్టులను బెంగాల్‌కు దూరం చేసిన రాజకీయ పాపం,శాపంగా మారి మమతను మింగేసింది.

కమలం ఎరలో.. పావులకు తప్పని తిప్పలు

బెంగాల్ తరహాలోనే హస్తినలో హస్తం పార్టీ అదృశ్యానికి.. కేజ్రీవాల్‌ను కమలం పార్టీ తొలుత ఎరగా వాడింది. అవసరం తీరాక ఆయన్ను జైలుకు పంపీ మరీ పంతం నెగ్గించుకున్న తీరు, దేశం కళ్లముందు కదలాడుతున్న నగ్నసత్యం. మహారాష్ట్రలో పవార్ ఫ్యామిలీని బరిలోకి దించి ఆపై పవర్ లాగేసుకోవడం, అందుకు ఏమాత్రం మినహాయింపు కాదు. ఠాక్రే ఫ్యామిలీకి టోక్రా వేసి బీటలు బారేలా చేయడం, దేశం యావత్తు నిశితంగా గమనించిందే.

ఎన్నికల పొత్తు పేరుతో బీహార్ సీఎం నితీష్‌ను బిగి కౌగిట్లో బంధించి, ఊపిరాడకుండా..ఇంకా ఉక్కిరి బిక్కిరి చేస్తున్న వైనం.. దేశం యావత్తు చూస్తున్నదే. తెలుగు రాష్ట్రాల నేతల కుత్తుకలపై కూడా కమలం కత్తులు నూరుతుందనే గుసగుసలు.. ఇక్కడి రాజకీయ వర్గాల్లో ప్రచారంలో ఉండనే ఉన్నాయి. కమలం స్నేహ హస్తంతో మొదలై .. రాజకీయాల్లో తలపండిన మమత, తన పోరాట పటిమతోనే తన అస్తిత్వాన్ని కాపాడుకుంటారనే నమ్మకం ఆమెతో పాటు, రాజకీయ పరిశీలకుల్లో బలంగాఉంది. ఎటొచ్చీ దక్షిణాది రాష్ట్రం తమిళనాట సరికొత్త ఫార్ములాతో ప్రత్యామ్నాయం చూపిన టీవీకే అధినేత విజయ్‌పై .. కమలం చూపు పడకపోతేనే అన్నింటా మంచింది. కమలం ఎరలకు ఆశపడి విజయ్ పార్టీ.. ఆ కోరలకు చిక్కితే.. మమత తరహా చేదు అనుభవం ఎప్పటికైనా., తప్పక పోవచ్చని పరిశీలకుల ముందస్తు అంచనా..

సంపాదకీయం

మాస్‌తో పెట్టుకుంటే మడతే...

దేశ రాజకీయాల్లో చరిత్రలో గత రెండేళ్లు అత్యంత కీలకమైన మార్పులకు సాక్ష్యంగా నిలిచాయి. తమ రాష్ట్రాల్లో ఎదురులేని నాయకులుగా వెలుగొందిన అగ్రనేతలు నేడు తమ సొంత గడ్డపై ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఢిల్లీ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. 2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మమతా బెనర్జీ రాజకీయ జీవితంలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయాయి. ముఖ్యమంత్రిగా ఉంటూ ఆమె తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో పరాజయం పాలయ్యారు. భారతీయ జనతాపార్టీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఆమె 15వేల ఓట్లకుపైగా తేడాతో ఓటమి చెందారు.

ఈ ఓటమిని మమతాబెనర్జీ జీర్ణించుకోలేకపోయారు. ఇది ప్రజాతీర్పు కాదని, కేవలం లూటీ మాత్రమేనని ఆమె తీవ్ర స్థాయిలో ఆరోపించారు. గత చరిత్రను పరిశీలిస్తే 2021 ఎన్నికల్లో కూడా ఆమె నందిగ్రామ్ నియోజకవర్గంలో ఇదే సువేందు అధికారి చేతిలో ఓడిపోయారు. అయితే అప్పట్లో ఆమె పార్టీ ఘన విజయం సాధించడంతో ఆమె ముఖ్యమంత్రిగా కొసాగారు. కానీ 2026లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక, బీజేపీ రాజకీయ వ్యూహాల ఒత్తిడి ఆమె పతనానికి దారి తీశాయి. దక్షిణ భారత రాజకీయాల్లో బలమైన నేతగా గుర్తింపు పొందిన ఎంకే స్టాలిన్‌కు కూడా 2026 చేదు అనుభవాన్ని మిగిల్చింది. మే 2026లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అధినేత స్టాలిన్ తన నియోజకవర్గం కొలత్తూరులో ఊహించని విధంగా ఓడిపోయారు. వరుసగా మూడుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన ఆయనకు ఈసారి ఓటరు మొహం చాటేశారు. టీవీకే పార్టీ అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో ఆయన 8,795 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ ఓటమి స్టాలిన్‌ను, డీఎంకే శ్రేణులను తీవ్ర ఆత్మరక్షణలోకి నెట్టింది. ఒక ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం అనేది ఆ రాష్ట్రంలో మారుతున్న రాజకీయ గాలికి నిదర్శనంగా చెబుతున్నారు.గతంలో కూడా ఇలాంటి ఉద్దండులు ఓడిపోయిన చరిత్ర ఉంది. రాజకీయాల్లో అనతి కాలంలోనే అగ్రస్థానానికి చేరుకున్న అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ ఓటర్లు 2025లో షాక్ ఇచ్చారు. ఫిబ్రవి 2025లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో న్యూదిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఓటమి చెందారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ చేతిలో ఆయన సుమారు మూడు వేలకుపైగా ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అధికారంలో ఉన్న వారు ఓడిపోవడం అనే ప్రక్రియ 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి ఊపందుకుంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీని వల్ల అప్పటి ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లోట్(రాజస్థాన్), భూపేష్ బఘేల్(చత్తీస్‌గఢ్) తమ కుర్చీలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మమతా బెనర్జీ, స్టాలిన్, కేజ్రీవాల్ వంటి నాయకులు తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోవడం అనేది కేవలం వ్యక్తిగత ఓటమి కాదు. పశ్చిమ బెంగాల్‌లోనని కీలకమైన నియోజకవర్గం భవానీపూర్‌లో హోరాహోరీ పోరు ముగిసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి, మమతా బెనర్జీని 15,114 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గం ఆరంభం నుంచే అందరి దృష్టిని ఆకర్షించింది. యాదృచ్ఛికంగా, భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్‌లో కూడా సువేందు అధికారి 9000కుపైగా ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ ఓటమి తృణమూల్‌కు, ముఖ్యంగా మమతాబెనర్జీకి బిగ్ షాక్ అనే చెప్పాలి. ఈసారి బెంగాల్‌లో కాషాయ తుపాను సంచలనాలు నమోదు చేసింది. చాలా జిల్లాల్లో కమలా పువ్వులు వికసించాయి. అనేక చోట్ల తృణమూల్ కాంగ్రెస్‌ను దాదాపుగా తుడిచిపెట్టేశారు. నందిగ్రామ్, భవానీపూర్ అనే రెండు నియోజకవర్గాల్లో సువేందు అధికారి పోటీ చేయంతో అందరి దృష్టి ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలపై పడింది. నందిగ్రామ్‌లో సువేందు సమీప ప్రత్యర్థి తృణమూల్‌కు చెందిన పవిత్ర కర్. ఈ అభ్యర్థి ఎన్నికలకు ముందు బీజేపీని వీడి తృణమూల్‌లో టికెట్ పొందారు. ఈ పవిత్ర కర్ ఒకప్పుడు సువేందు సహాయంతో బీజేపీలో చేరారని వినికిడి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో సువేందు ఈ అభ్యర్థిని ఓడించారు. అది ఆయా పార్టీల పతనాన్ని లేదా ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని సూచించే కీలక సంకేతం. ఇక అస్సాంలో అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న, మూడుసార్లు ఎంపీగా గెలిచిన గౌరవ్ గొగోయ్ తన సొంత ఇలాకా జోర్హాట్‌లో ఓటమి పాలవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ వారసుడిగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన గౌరవ్.. బీజేపీ సీనియర్ నేత హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో దాదాపు 22,000 ఓట్ల భారీ తేడాతో పరాజయం పాలయ్యారు. తన లోక్‌సభ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పట్టు కోల్పోవడం గమనార్హం.

గౌరవ్ గొగోయ్ ఓటమికి ప్రధాన కారణం ప్రజలకు అందుబాటులో లేకపోవడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచార సమయంలో ఆయన క్షేత్రస్థాయిలో తగినంతగా కనిపించలేదని.. కేవలం తన తండ్రి పేరు మీద, అహోం సామాజిక వర్గ సమీకరణాల మీద అతిగా ఆధార పడటం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా గౌరవ్‌ను 'జాతీయ రాజకీయాలకు మాత్రమే సరిపోయే నేత'గా చిత్రీకరించడంలో సఫలమైందని పేర్కొంటున్నారు. స్థానిక సమస్యల కంటే ఢిల్లీ రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసిందని వివరిస్తున్నారుభారత రాజకీయాల్లో ఇప్పుడు కొత్త నాయకత్వానికి, మార్పుకు సమయ ఆసన్నమైందని ఫలితాలు నిరూపిస్తున్నాయి. రాబోయే కాలంలో ఈ నాయకులు తిరిగి పంజుకుంటారా లేదా కొత్త శక్తులు మరింత బలోపేతం అవుతాయా అనేది వేచి చూడాలి.

విశాఖలో రూ.లక్ష కోట్లతో
రిలయన్స్ డేటా సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో 2,01,023 కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఒప్పందాలన్నీ అమలయ్యేలా చూడాలని అన్నారు. అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలని చెప్పారు. కంపెనీలు కూడా శంకుస్థాపన నుండి ఉత్పత్తి వరకు నిర్దిష్టమైన కాలపరిమితికి కట్టుబడి ఉండాలని అన్నారు. ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని అధికారులను ఆదేశించారు. అనుమతుల జారీ విషయంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపురావాలని, ఒక బ్రాండ్ ఇమేజ్‌గా ఆ గుర్తింపు ఉండాలని చెప్పారు. పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతర రాష్ట్రాల కంటే మనం ఎలా భిన్నమో స్పష్టంగా చెప్పాలన్నారు.

ఎంఎస్ఎంఇలకూ ప్రాధాన్యం

పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగానే ఎంఎస్ఎంఇలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం దిశా నిర్దేశం చేశారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఇలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ ?లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయని. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు వచ్చేలా చూడాలన్నారు.

రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు జివిఏ పెంచాలని అన్నారు.. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ లభిస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రులు టిజి భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

సెల్యూట్..సుమతి మేడం

- ఖాకీ ధైర్యం అంటే ఇదే...

- మల్కాజ్‌గిరి సీపీ సుమతి సంచలన ఆపరేషన్!

హైదరాబాద్- సూర్య వాస్తవం :

మహిళల భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని మరోసారి నిరూపించారు మల్కాజ్‌గిరి సీపీ సుమతి. సాధారణ మహిళలా వేషం వేసి అర్ధరాత్రి రోడ్లపై స్వయంగా నిలబడి, సమాజంలో దాగి ఉన్న అసలు సమస్యను బయటపెట్టిన తీరు నిజంగా అభినందనీయం. దిల్‌సుఖ్‌నగర్ పరిసరాల్లో అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 3.30 వరకు కొనసాగిన ఈ స్పెషల్ ఆపరేషన్‌లో సీపీ సుమతి చూపిన ధైర్యం, తెలివితేటలు పోలీస్ వ్యవస్థకు గర్వకారణం. కామన్ లేడీగా నిలబడి ఉన్న ఆమెను టార్గెట్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తించిన ఆకతాయిలను ఒక్కొక్కరిని కట్టడి చేయడం ద్వారా మహిళలపై జరుగుతున్న వేధింపుల నిజ స్వరూపాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు.

"వస్తావా? రేటెంత?" వంటి అసభ్య పదజాలంతో వేధించిన పోకిరీలకు ఈ ఆపరేషన్ గట్టి హెచ్చరికగా మారింది. మొత్తం 40 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వీరిలో ఎక్కువమంది విద్యార్థులు, ఉద్యోగార్థులే కావడం ఆందోళన కలిగించే అంశం. ఈ ఘటనతో సమాజానికి ఒక బలమైన సందేశం వెళ్లింది.మహిళలపై వేధింపులు చేస్తే ఎవరైనా సరే చట్టం ముందు తలవంచాల్సిందే. సీపీ సుమతి తీసుకున్న ఈ ధైర్య నిర్ణయం మహిళల భద్రతకు ఒక కొత్త దిశ చూపించింది. ఖాకీ యూనిఫాం ధరించిన నిజమైన సింగం అంటే ఇదే అని అందరూ ప్రశంసిస్తున్నారు. ఇలాంటి అధికారులు ఉన్నంత వరకు మహిళలకు భయం అవసరం లేదు అనే నమ్మకం మరింత బలపడింది.

సూరారం వరి కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ ఫైర్...!!

- అధికారుల వైఫల్యంపై తీవ్ర విమర్శలు

- రైతుల నష్టానికి బాధ్యత ఎవరిది అని నిలదీత

- రాజకీయ ప్రచారమే గాని, నేలస్థాయి పనులు శూన్యమని ఆరోపణ

మహాదేవపూర్ - సూర్య వాస్తవం :జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రం అకాల వర్షాలకు పూర్తిగా నీట మునిగిపోవడంతో రైతుల కష్టార్జిత పంట నాశనం కావడం తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా సూరారం మాజీ సర్పంచ్ నాగుల లచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వర్షాలు పడే సూచనలు ముందుగానే ఉన్నప్పటికీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస రక్షణ చర్యలు లేకపోవడం వల్ల రైతుల వడ్లు నీట మునిగిపోయాయని ఆరోపించారు. "రైతు కష్టాన్ని ఇలా నీటిలో కలపడం ప్రభుత్వానికి సిగ్గుగా అనిపించదా? వడ్లను కాపాడే బాధ్యత ఎవరిది? అధికారులు ఎక్కడున్నారు?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతుల పట్ల ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మాటల్లో మాత్రమే రైతు సంక్షేమం చెబుతూ, కార్యాచరణలో పూర్తిగా విఫలమైందని ఘాటుగా విమర్శించారు. రాజకీయాలకతీతంగా వెంటనే రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని, కొనుగోలు కేంద్రాల్లో తక్షణ చర్యలు తీసుకుని మిగిలిన వడ్లను రక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. స్థానిక రైతులు కూడా తమ వేదనను వ్యక్తం చేస్తూ, "మా కష్టం అంతా నీటిలో పోయింది... మాకు న్యాయం ఎప్పుడు?" అంటూ కన్నీరు మున్నీరయ్యారు.

భారత్‌లో వియత్నాం అధ్యక్షుడు పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

అలాగే ఈ సమావేశంలో పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపైనా చర్చించుకోనున్నారని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. కాగా, మంగళవారం టోలామ్ బీహార్‌లోని చారిత్రాత్మకమైన మహాబుద్ధి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

బీజేపీలో ప్రతి ఆరవ ఎంపీ
ఓటు చోరీతోనే గెలిచారు

(మొదటిపేజీ తరువాయి)

బిజెపి పరిభాషలో చెప్పాలంటే వారిని 'ఘుస్పేథియా' (చొరబాటు దారులు) అని పిలవాలా? ఉదాహరణకు హర్యానా సంగతేంటి? అక్కడ మొత్తం ప్రభుత్వమే ఒక 'ఘుస్పేథియా'. ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించడానికి వారు తమ గుప్పిట్లో ఉంచుకునే, తమకు అనుకూలంగా మలచుకునే సంస్థలే స్వయంగా 'రిమోట్ కంట్రోల్' చేస్తున్నాయి. వారి (బిజెపి నేతలు) అసలు భయం సత్యమే. ఎందుకంటే, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే, వారు ఈ రోజు 140 సీట్లు కూడా గెలుచుకోలేరు అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

సంపద, పరిపాలన అందరికీ
సమానంగా పంచాలి

కట్టుబడి ఉందని అన్నారు. ఉత్పత్తి అయిన సంపద సమానంగా పంపిణీ కావాలి. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సమాన వాటా, సమాన జీవితం లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. సిద్ధరామేశ్వరునితో సహా సాధువులు సమాజంలో కుల వ్యవస్థను నిర్మూలించాలని కోరుకున్నారు. బసవాది శరణ్ 12వ శతాబ్దంలో సమానత్వ సిద్ధాంతాన్ని బోధించారు. దోపిడీకి గురైన, అణగారిన వర్గాలు సంఘటితమయ్యే సమావేశాలు మంచి పనులని ఆయన అన్నారు. బసవన్న బోధించిన సామాజిక న్యాయాన్ని నేను నమ్ముతాను. రాజకీయ స్వేచ్ఛ అనేది ఆర్థిక, సామాజిక స్వేచ్ఛ అనే పునాదిపై ఆధారపడి ఉంటుంది. విద్య ద్వారా మాత్రమే సామాజిక-ఆర్థిక శక్తిని సాధించగలమని ఆయన అన్నారు.

ప్రజలను ఇబ్బందిపెట్టకండి

హైదరాబాద్- సూర్య వాస్తవం

తన కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బందిపెట్టడం సరికాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో తన పర్యటనల సమయంలో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. ప్రజలను రోడ్లపై గంటల తరబడి నిలబెట్టవద్దని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఢిల్లీ వెళుతున్న క్రమంలో విమానాశ్రయం సమీపంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. తాను వెళుతున్న క్రమంలో, ట్రాఫిక్ నిలిపివేయడంతో వాహనాలు పెద్ద ఎత్తున ఆగడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని అన్నారు. కాన్వాయ్ వెళ్లే దారితో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను కూడా ఆపేసి ప్రజలను ఇబ్బంది పెట్టడమేమిటని ప్రశ్నించారు. అలా చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీసు కమిషనర్లతో డీజీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యపై ముఖ్యమంత్రి పదేపదే మాట్లాడుతున్నారని, ఇది సమస్య తీవ్రతను తెలియజేస్తోందని అన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పటిష్ఠం చేసేందుకు అడిషనల్ డీజీపీ ఆధ్వర్యంలో త్వరలోనే ట్రాఫిక్ బ్యూరో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి వివిధవిధానాలను రూపొందిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా సింగిల్ లైన్‌గా విభజించి వాహనాలను పంపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను ముందు సిద్ధం చేసుకోవాలని సూచించారు. విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

- పెన్నహోబిలం మడుగు తేరులో పాల్గొన్న ఆర్థిక శాఖ మంత్రి, కాల్వ శ్రీనివాసులు

ఉరవకొండ - సూర్య వాస్తవం: పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన 'మడుగు తేరు' కార్యక్రమం భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఈ వేడుకలో పాల్గొన్నారు. మంత్రితో కలిసి ఎమ్మెల్యే, వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. పెన్నహోబిలం క్షేత్రం అనంతపురం జిల్లాలో పెన్నా నది తీరాన వెలసిన అత్యంత శక్తివంతమైన పుణ్యక్షేత్రం. ఇక్కడ స్వామివారి పాదముద్రలు ఉండటం విశేషం. ఇలాంటి ఉత్సవాలు మన సంస్కృతిని, సంప్రదా యాలను ప్రతిబింబించడమే కాకుండా భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతాయి.

తమిళనాడులో విజయ్ విజిల్ మోగింది

- విజయ్ దళపతికి అభినందనలు
- దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్

పులివెందుల - సూర్య వాస్తవం:

తమిళనాడు శాసనసభ ఎన్నికలలో ఘన విజయం సాధించిన విజయ్ దళపతికి నా హృదయపూర్వక అభినం దనలు తెలియజేస్తున్నాను అని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి ఇంత గొప్ప నాయకుడిగా ఎదగడం చాలా గర్వకారణం అన్నారు. తమిళనాడు ప్రజలకు సేవ చేయడంలోనూ, వారి నూతన పురోగతికి శ్రేయస్సుకు అర్థవంతంగా తోడ్పడటంలోనూ ఆయన చేసే కృషిలో సంపూర్ణ విజయం చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఆయన మీద ఎంతో విశ్వాసాన్ని పెట్టుకొని ఆయన ఏర్పాటు చేసిన పార్టీకి ఓట్లు వేయడం జరిగిందన్నారు. తమిళనాడులో విజయ్ విజిల్ మోగిందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు

పామిడి - సూర్య వాస్తవం: పామిడి పట్టణంలోని దిగువమాల గేరిలో వెలిసినటువంటి శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో బుధవారం పెన్నోబలం నరసింహస్వామి తేరు సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారు జామున నుండి స్వామి వారికి భక్తుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచా మృత అ భిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కైకర్యాల అనంతరం ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ దర్శనమిచ్చాడు. ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ప్రతి శుక్రవారం శనివారం పూజలు జరుగుతాయి కానీ ఈ దేవాలయం నందు ఇంత విశేష పూజలు జరుగుతున్న గాని కానీ దీప దూప నైవేద్యానికి నోచుకోలేదు అదేవిధంగా గుడి శిధిల అవస్థలకి చేరినది అందువలన గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే పామిడి ఇన్చార్జి ఈశ్వర్ ఎన్నో దేవాలయాల నిర్మాణం కార్యక్రమము చేపట్టినారు అదేవిధంగా మా కాలనీ నందు లక్ష్మి నరసింహ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మాణం జరిపించాలని కాలనీవాసులు కోరుచున్నారు.

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు హర్షనీయం

- మరి మిగతా అంశాల మాటేమిటి?
- ప్రశ్నించిన తులసి రెడ్డి

వేంపల్లె - సూర్య వాస్తవం : విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము రాష్ట్ర విభజన జరిగిన 6 నెలల లోపల ఆంధ్రప్రదేశ్లో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి ఎప్పుడో ఆంధ్ర ప్రదేశ్లో విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు అయి ఉండేది. దురదృష్టవశాత్తు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడంతో గత 11 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్లో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు కాలేదు. ఎట్టకేలకు 11 సంవత్సరాల తర్వాత అయినా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేయ డం హర్షనీయం అన్నారు. అదేవిధంగా విభజన చట్టంలో పేర్కొని అమలు కాకుండా ఉన్న మిగతా అంశాలను కూడా అమలు చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

1. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదాను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.
2. విభజన చట్టంలో సెక్షన్ 46,సబ్ సెక్షన్ 3 ప్రకారము రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని అమలు చేయాలి.కానీ ఇంతవరకు అమలు కాలేదు . దీనిని వెంటనే అమలు చేయాలి.
3. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము రాష్ట్ర విభజన జరిగిన ఆరు నెలల లోపల కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో సమీకృత ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలి. ఇంతవరకు నిర్మించలేదు. దీనిని నిర్మించాలి.
4. విభజన చట్టంలో 13వ షెడ్యూల్లో దుగరాజపట్నం వద్ద మేజర్ ఓడరేవును 2018 కల్లా నిర్మించాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. కానీ నిర్మించలేదు. వెంటనే నిర్మించాలి.
5. రాయలసీమ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కడప రాయచోటి మదనపల్లి బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసింది.కడప నుంచి పెండ్లిమర్రి వరకు పూర్తయింది.తర్వాత నిలిచిపోయింది. ఈ పనులు వెంటనే పునఃప్రారంభించాలని తులసి రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,కదిరి ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తో పిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో భూమి రెడ్డి ఉమాదేవి

పులివెందుల రూరల్ - సూర్య వాస్తవం: పులివెందుల పట్టణం, విజయ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన పోరెడ్డి రామకృష్ణా రెడ్డి కుమారుడి యశ్వంత్ రెడ్డి, చందనల వివాహ వేడుకలకు ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ఉమాదేవి నూతన వధూ వరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వివాహ బంధం అతి పవిత్ర మైందని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివాహ వేడుకల్లో ఉమాదేవితో పలువురు ఆప్యాయంగా పలకరించగా వారితో కొద్దిసేపు ఆనందంగా గడిపారు. ఈ కార్య క్రమంలో వివాహ బంధుమిత్రులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరానికి విశేష స్పందన

- వైద్యుల సలహాలు తప్పనిసరిగా పాటించాలి
- తిరుమలరెడ్డి సేవలు అభినందనీయం
- శంకర్ నేత్రాలయ ఇన్చార్జ్ భాను ప్రకాష్

పులివెందుల - సూర్య వాస్తవం: పులివెందుల పట్టణంలోని స్థానిక బాకరాపురం లోని వెంకటప్ప మెమోరియల్ పాఠశాలలో కంభం తిరుమలరెడ్డి ధర్మపత్ని రామ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటిపుర చికిత్స కార్యక్రమానికి వారం రోజులపాటు విశేష స్పందన లభించిందని శంకర్ నేత్రాలయ ఇంచార్జ్ భాను ప్రకాష్ అన్నారు. బుధవారం కంటి పరీక్షలు చేయించుకున్న వారితో ఆయన సమావేశాన్ని నిర్వహించి సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ నేత్రాలయ పుట్టపర్తి, కంభం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఐదో తేదీ వరకు ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఏటాకంభం తిరుమలరెడ్డి ధర్మపత్ని రామ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు తిరుమల్ రెడ్డి ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి మాత్రలు, అద్దాలు, ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారు అద్దాలు నెలరోజుల పాటు గాలి తగలకుండా వాడాలన్నారు. ఇచ్చిన చుక్కల మందులను క్రమం తప్పకుండా కంటిలో వేసుకోవాలన్నారు. ఇక్కడికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సౌకర్యాన్ని, భోజన సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ ప్రజలు శంకర్ నేత్రాలయ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరమ్మతులు

- తూగుట్ల మధుకి కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

పులివెందుల - సూర్య వాస్తవం: పులివెందుల వెలమవారిపల్లె దారిలో మురికి నీరు డ్రైనేజ్ లీకేజీ సమస్య ప్రజల ఇబ్బందిని మున్సిపల్ సిబ్బందితో కలిసి టీడీపీ నాయకుడు తుగుట్ల మధుసూదన్ రెడ్డి పరిష్కరించారు. పులివెందుల వెలమవారిపల్లె దారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీకేజీ పరిస్థితి విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు మధుసూదన్ రెడ్డి అక్కడకి చేర్కొని అధికారులకు విషయాన్ని తెలియజేసి డ్రైనేజ్ క్లీనింగ్ టాంకర్ ద్వారా క్లియర్ చెయించి మరియు దారిలో గుంతలను జెసిబి ద్వారా క్లియర్ చేయించారు. సమస్య పట్ల త్వరితగతిన స్పందించి తిరస్కరించడం పట్ల స్థానికులు మున్సిపల్ సిబ్బందికి మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మునికుమార్, మున్సిపల్ ఇంజనీర్, యమహా షోరూం చాంద్ బాషా, షైక్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి బలి

- శిరసనంబేడు గ్రామంలో విషాదం
- ఉరుములు మెరుపుల మధ్య చోటుచేసుకున్న దుర్ఘటన
- ఆవేదనలో నిరుపేద కుటుంబం

పెళ్లకూరు - సూర్య వాస్తవం : పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామంలో బుధవారం జరిగిన విషాదకర సంఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. గ్రామానికి చెందిన సంచి సిద్ధార్థ (48) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్ధార్థ తనకు ఉన్న గొర్రెల మందను మేపుతూ ఉండగా, ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైంది.

ఈ క్రమంలో ఆకస్మికంగా పడిన పిడుగు అతనిపై పడడంతో, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్లినా, అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. ఈ వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆర్తనాదాలు చేస్తూ విలపించగా, గ్రామస్తుల కళ్లలో నీళ్లు తెప్పించే దృశ్యాలు కనిపించాయి. సిద్ధార్థ మృతితో ఆ కుటుంబం ఒక్కసారిగా ఆధారహీనంగా మారింది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. రోజూ కష్టపడి పని చేసి కుటుంబాన్ని పోషించే సిద్ధార్థ, "రెక్కాడితే గాని డొక్కాడని" పరిస్థితుల్లో జీవిస్తున్న నిరుపేద వ్యక్తి. అతని ఆకస్మిక మృతి ఆ కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక, మానసిక సంక్షోభంలోకి నెట్టింది. ఈ నేపథ్యంలో, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కనీసం ఎక్స్‌గ్రేషియా అందించి, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషాద ఘటన గ్రామంలో ప్రతి ఒక్కరినీ కలచివేసింది. పిడుగుపాటు వంటి ప్రకృతి విపత్తులు ఎంత ప్రమాదకరమో మరోసారి గుర్తు చేస్తూ, రైతులు, కాపరులు అప్రమత్తంగా ఉండాలని పెద్దలు సూచిస్తున్నారు.

మంత్రి మండిపల్లిపై వైసీపీ నాయకులు
అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలి

లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :

అరాచకాలు అన్యాయాలకు కేరాఫ్ వైఎస్ఆర్ పార్టీ అని ప్రజలు అంటారు. రాయచోటిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా యోజన క్రీడా శాఖ మంత్రి బండి పల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబంపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డయ్య యాదవ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మాను కోవాలి అన్నారు.దశరధ రామిరెడ్డి ఘర్షణలో మంత్రి కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో దశరధరామిరెడ్డి

మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్నప్పుడు దోచుకున్న స్థలాల వివాదమే ఈ ఘర్షణకు దారి తీసింది అన్నారు. విశ్రాంతి ఉద్యోగైన ఆదినారాయణ రెడ్డి స్థలం తనదని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న విషయం అందరికీ తెలుసు అన్నారు. అయితే ఆదినారాయణ రెడ్డి దశరధరామిరెడ్డి ఇరువురు

ఘర్షణ పడడంతో ఈ ఘర్షలతో దశరథ రామిరెడ్డి గాయపడ్డారని ఈ ఘర్షణకు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఆయన మేనల్లుడు మౌర్య రెడ్డి తమ్ముడు లక్ష్మి ప్రసాద్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. గతంలో రాయచోటి ప్రాంతంలో ఎవరు అన్యాయంగా అక్రమాలుగా స్థలాలు దోచుకున్నారో ప్రజలకు తెలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడుగు వాసుదేవుడు గురుమూర్తి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలి

- సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం : ప్రజల సొమ్ముతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను సంవత్సరాలుగా నిరుపయోగంగా వదిలేయడం పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, బుధవారం బస్టాండ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులకు ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన బస్టాండ్‌ను ఉద్దేశపూర్వకంగా వాడుకలోకి తీసుకురాకపోవడం అనేది పూర్తిగా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. అధికారులు కేవలం పేపర్‌లపై పనులు పూర్తయ్యాయని చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రయాణికులు రోడ్ల పక్కనే ఎండలో, వర్షంలో నిలబడి బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొనడం ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తోందని ఆయన అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం

కొనసాగిస్తే దాని ఫలితాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా, బస్టాండ్ సమీపంలో ప్రజలకు అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడం తీవ్రమైన లోపమని అన్నారు.వెంటనే శుభ్రంగా, ఉపయోగించగలిగే విధంగా ప్రజలకు అనుకూలంగా మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి బస్టాండ్‌ను ప్రారంభించడంతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తామని, అవసరమైతే రోడ్డు రోకోలు, ధర్నాలు చేపట్టి ప్రభుత్వాన్ని కుదిపేస్తామని స్పష్టం చేశారు.ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఓబులేసు, ఆంజనేయులు, జగన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో
విద్యార్థుల ప్రతిభ

- పాలిసెట్-2026 ఫలితాల్లో 75 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్

సింహాద్రిపురం - సూర్య వాస్తవం: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పాలిసెట్--2026 ఫలితాల్లో సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. మంగళవారం (మే 5) విడుదలైన ఈ ఫలితాల్లో కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ పొందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటారని ఉచిత శిక్షణలో పాల్గొన్న 131 మంది విద్యార్థులలో 75 శాతం మంది అర్హత సాధించారని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్ తెలిపారు. ప్రత్యేకంగా టాప్ ర్యాంకర్లగా కోచింగ్ తీసుకున్న విద్యార్థినిలు ?అభినయ శ్రీ 4721 ర్యాంకు (హాల్ టికెట్: 5471010)?వెంకట పవిత్ర 5128 ర్యాంకు (హాల్ టికెట్: 5471009) నాగ హస్మిత 5321 ర్యాంకు (హాల్ టికెట్: 5471079) సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్ ప్రత్యేకంగా అభినందించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ర్యాంకులు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌బిటిఇటి,ఆంధ్రప్రదేశ్ (మంగళగిరి) ఆధ్వర్యంలో నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలు, కౌన్సెలింగ్‌కు సంబంధించిన సందేహాల కోసం 9010222184 నంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు.

" ఉచిత కంటి" ఆపరేషన్లకు విశేష స్పందన !

పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం : పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు, యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో విజయవంతంగా కంటి ఆపరేషన్లు జరిగాయని, ఈ కంటి ఆపరేషన్లకు విశేష స్పందన వచ్చిందని ఆసుపత్రి కోఆర్డినేటర్ అరులు తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం యందు వైద్య పరీక్షల అనంతరం ఆపరేషన్లు చేయించుకున్న వారికి సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బెంగళూరు చిట్టెం హనుమాన్ ప్రసాద్, చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో అత్యాధునిక పరికరాలతో వారం రోజుల నుండి కంటి వైద్య పరీక్షలు మరియు మూడు రోజుల నుండి కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్ తుమ్మంద్రా వెంకటేశ్వర్లు కుటుంబం, ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ సురేష్ కుమార్ వారి కుటుంబం ఆధ్వర్యంలో కంటి ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు అన్నదానం, యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఉదయం 21 మందికి ఆపరేషన్‌లు, దాదాపు 95 మందికి వైద్య పరీక్షలు చేశామని శంకర నేత్రాలయ ఆసుపత్రి కోఆర్డినేటర్స్ అరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ కృష్ణా నాయక్, పూర్వ విద్యార్థులు వీరేశప్ప, సాయిబాబా, భాస్కర్ యువ స్పందన సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సురేంద్ర, లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు, సభ్యులు మధు, రమేష్, గిరి, రాజేశ్వరి, వాలంటీర్లు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధి ప్రబలకుండా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించండి

- జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం : రాబోయే సీజన్‌లో వర్షాలు కురుస్తాయని దీంతో మలేరియా వ్యాధి ప్రబలకుండా గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆసుపత్రిలో ఆరోగ్య కార్యకర్తలకు సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆయన వివరించారు. రాబోయే కాలంలో వర్షాలు కురుస్తాయని దీంతో గ్రామాలలో మురికినీరు అశుభ్రత పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించాలన్నారు. గ్రామాలలో పశువులు ఉన్న ప్రాంతాలలో మురికి నీరు ప్రవహిస్తుందని అక్కడ దోమలు చేరి మలేరియా డెంగు చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రభులే అవకాశాలు ఉంటాయని ప్రజలకు పరిశుభ్రత గురించి పారిశుధ్యం గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించి మరుగుదొడ్లలోని తొట్లలో నీటిని శుభ్రం చేసి తొట్లను ఆరబెట్టాలన్నారు. ఎక్కడే గాని మురికినీరు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో దానం ఎంపీహెచ్ఎస్ మహమ్మద్ భాష జిల్లా మలేరియా సభ్యులు ఆఫీసర్ జయరామయ్య జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ శివ హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్ అహ్మద్ రాంచంద్రారెడ్డి మల్లికార్జున ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పాలేటమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న తులసి రెడ్డి

వేంపల్లె - సూర్య వాస్తవం : వేంపల్లి మండలం,ముత్తుకూరు గ్రామ పొలిమేరలో బుధవారం శ్రీ పాలేటమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,సుబ్బారెడ్డి, ఐచర్ రమణ, నర్రెడ్డి శంకర్ రెడ్డి తదితరులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఉత్తమారెడ్డి, మస్తాన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి,ఆంజనేయ రెడ్డి, సాంబశివుడు తులసి రెడ్డికి కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం పలికారు.తులసి రెడ్డిని శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ అశాంతితో అలమటిస్తున్న ఆధునిక మానవునికి ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రశాంతిని కలిగిస్తాయన్నారు.అటువంటి ఆధ్యాత్మిక కేంద్రమే శ్రీ పాలేటమ్మ తల్లి ఆలయం అన్నారు.విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు ఆలయ నిర్వాహకులను తులసి రెడ్డి అభినందించారు.గ్రామదేవత పాలేటమ్మ తల్లి కరుణాకటాక్ష వీక్షణాలు గ్రామ ప్రజలపై ప్రసరించాలని కోరుకున్నారు పాలేటమ్మ తల్లి ఆశీర్వాదాలతో ముత్తుకూరు,పరిసర పల్లెల ప్రజానీకం సుఖశాంతులతో,శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

- డిసిహెచ్ఎస్ లక్ష్మీప్రసాద్

లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం : వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిసీహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి కమ్యూనిటీ ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా ల్యాబ్ టెక్నిక్ ఎక్సరే ఆపరేషన్లు గదులను ఆయన పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మధ్యాహ్న సమయంలో భోజనం ఏర్పాటు చేస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 30 పడకల ఆసుపత్రిని ప్రభుత్వ అన్ని వసతులు కల్పించిందని వీటిని ఉపయో గించి సామాన్య రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ఇతర ప్రాంతాలకు తరలించకుండా సాధ్యమైనంత వరకు చికిత్స చేయాలన్నారు. 24 గంటలు అందుబాటులో ఉన్నామని డాక్టర్లు డి సి హెచ్ ఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎన్ఎస్ ప్రసాద్, సులోచన, శివ ప్రసాద్ హిందూజ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం : మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లి చింతకుంట వాళ్ళ పల్లి మధ్యలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పకీరమ్మ (70) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై గోల్కొండ శోభ తెలిపారు. ఎస్ఐ వివరాలు మేరకు పకీరమ్మ కోనంపేట పంచాయతీలోని కాలాడివాండ్ల పల్లెకు చెందినదని ఉదయాన్నే ఉపాధి పని చేసుకుని మధ్యాహ్నం బ్యాంకులో పని పూర్తి చేసుకొని కూరగాయలు తీసుకొని కాలాడివాండ్ల పల్లెకు కాలినడకన వెళ్తుండగా కోనంపేట నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే రెండు కాళ్లు చేతులు విరిగి మృత్యువాత పడిందని ఆమె తెలిపారు. ఈ మేరకు కార్ డ్రైవర్ పై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

గాంధారి యోగ శిక్షణ ముగింపు

- గురువుకు ఘన సన్మానం

వేంపల్లె - సూర్య వాస్తవం : వేంపల్లి చైతన్య స్కూల్‌లో గత ఆరు రోజులుగా నిర్వహించిన గాంధారి యోగ విద్య శిక్షణా కార్యక్రమం బుధవారం ఘనంగా ముగిసింది. 6నుండి 16సంవత్సరాల వయసు గల 25 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని మానసిక శక్తి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంకళ్లకు గంతలు కట్టుకొని కలర్స్ గుర్తించడం, సైకిల్ తొక్కడం,మోటార్ సైకిల్ తోలడం, ఒక మనిషి వాసన పసిగట్టి ఆ మనిషి ఎక్కడ ఉన్నా అతనిని పట్టుకోవడం పెంపొందించుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి ఎన్ ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ కరెస్పాండెంట్ నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన గురువు, రిటైర్డ్ టీచర్ కవి వరప్రసాద్ రావుని పూల మాల, శాలువా, పండ్ల బుట్టలతో ఘనంగా సన్మానించారు. కవి వరప్రసాద్ రావు మాట్లాడుతూ గాంధారి యోగ విద్య ద్వారా పిల్లల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికితీసి, చదువులో రాణించేలా తీర్చిదిద్దడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మానవతా వేంపల్లె మండల ప్రెసిడెంట్ యోగేశ్వర్, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ చక్రపాణి రెడ్డి స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

'ఒక నెల ఒక గ్రామం'తో భూ సమస్యలకు చెక్.....

- డక్కిలి తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు

డక్కిలి- సూర్యవాస్తవం : గ్రామలలో శాశ్వత భూ వివాదాలు పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా ఇకపై ప్రతినెల ఒక గ్రామంలో ఒక నెల ఒక గ్రామం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి భూ సమస్యను అందరి సమక్షంలో పరిశీలించి పరిష్కరించే విధంగా ప్రజా ఫిర్యాదులపై సర్జికల్ స్ట్రైక్ స్థాయిలో పనిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దిశా నిర్దేశం తహసీల్దార్లకు ఇవ్వడం జరిగిందని ఆ ప్రకారం రెవెన్యూ అధికారులు ప్రతి గ్రామ పంచాయతీ సంబంధించి భూ రికార్డులన్నిటిని సిద్ధంగా ఉంచుకోవాలని డక్కిలి మండల తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిత్యం అధిక సంఖ్యలో ఫిర్యాదులు భూ సమస్యల మీద వస్తున్నాయని వాటిని దృష్టిలో ఉంచుకొని పైలెట్ ప్రాజెక్టుగా ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో గత సంవత్సరం డిసెంబర్ నుండి ఒక నెల ఒక గ్రామం నిర్వహిస్తున్నారని ఈ విధానం ద్వారా గ్రామాలలో భూ సమస్యలపై 18 శాతం నుండి ఏడు శాతానికి తగ్గిపోయాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ ఆర్, వెబ్ ల్యాండ్ లోపాలు, భూ సరిహద్దు వివాదాలు, దారి సమస్యలు, సాదా బైనామాలు, ఖాతా మార్పులు, పాత సర్వే నంబర్లు, ఆక్రమణలు తదితర అన్ని సమస్యలను పరిశీలించి పరిష్కరి స్తామన్నారు. మండలంలో మొదటగా నాగవోలు గ్రామం లో ఒక నెల... ఒక గ్రామం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

తీరనున్న నీటి కష్టాలు

- రంగంలోకి దిగిన టీడీపీ నేతలు
- నలుగు మోటార్లకు మరమ్మతులు
- తాగునీరు విడుదల చేసిన మండల కన్వీనర్

వేంపల్లె - సూర్య వాస్తవం : వేంపల్లె గ్రామపంచాయతీ పరిధిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి స్పష్టం చేశారు. పట్టణానికి నీటిని సరఫరా చేసే నాలుగు ప్రధాన విద్యుత్ మోటార్లు ఇటీవల సాంకేతిక కారణాలతో కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ సమస్యపై నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ బిటెక్ రవి తక్షణమే స్పందించి, యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదేశాల మేరకు, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పార్టీ నాయకుడు మొండోడు గౌస్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

పాపాగ్ని నదిలో రెండు మోటార్లు

సాయిబాబా గుడి వద్ద ఒకటి, చింతలమడుగు పల్లి వద్ద మరొకటి. మొత్తం నాలుగు మోటార్లను సొంత ఖర్చులతో బాగు చేయించి, పునరుద్ధరించారు. బుధవారం సాయంత్రం ఈ మోటార్ల ద్వారా నీటి సరఫరాను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా రామమునిరెడ్డి మాట్లాడుతూ.వేసవి దృష్ట్యా ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకూడదన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎక్కడైనా పైపులైన్ల సమస్య ఉన్నా లేదా నీటి ఎద్దడి తలెత్తినా, వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ప్రజలు త్రాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బుధవారం శ్రీరామ్మగర్ గుట్టకు రెండు నీటి ట్యాంకర్లతో,నీరు తోలడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొండోడు గౌస్, పసుపులేటి వీరభద్ర, మహమ్మద్, జబీబుల్లా, డక్కా రమేష్ గోగుల మారుతి డేరంగుల బాబు మేస్త్రీ రమణ మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామునిపై కొండా సురేఖ వ్యాఖ్యలు అహంకారపురితం

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

వేంపల్లె - సూర్య వాస్తవం : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శ్రీరాముని పై చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రియా తోటలో ఉన్న శ్రీరాముని ఆలయం ఎదురుగా భా.జ.పా నాయకులు కొండా సురేఖ చిత్రపటాలను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైశ్రీరామ్ అంటే కోట్లాది మంది హిందువుల విశ్వాసం అని తెలిపారు. అలాంటిది కేవలం జైశ్రీరామ్ అంటే పైనుంచి నిధులు పడతాయా అని మంత్రి వ్యాఖ్యానించడం సబబు కాదని అన్నారు. కోట్లాదిమంది హిందువుల మనోభావాలతో ఆటలాడిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తోపాటు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కు పట్టిన గతి మీకు కూడా పడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు లేకుండానే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను కించపరచడమే కాంగ్రెస్ పార్టీ నాయకుల అసలు నైజమని అన్నారు. శ్రీరాముని అపహాస్యం చేసిన కొండా సురేఖకు దేవాదాయ శాఖ మంత్రి గా కొనసాగే నైతిక అర్హత ఏమాత్రం లేదని అన్నారు. అత్యధిక మెజారిటీ కలిగిన హిందువుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన మీరు ఇతర మతాలను విమర్శించే ధైర్యం చేయగలరా అని ప్రశ్నించారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యాదర్శి విశ్వనాథరెడ్డి, మునగల రాము బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, సురేష్, లోకేష్ నాయక్, ఆంజనేయులు నాయక్, రెడ్డి నాయక్ లక్ష్మీదేవి, వీరయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలి

- ఫైర్ ఆఫీసర్ బి.శివరాం రెడ్డి

వేంపల్లె - సూర్య వాస్తవం: అగ్ని ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణపాయం నుండి బయట పడవచ్చు అని అగ్నిమాపక అధికారి బి.శివరాం రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తయార పెట్రోల్ బంక్ యందు రమ్మదారుల పట్ల అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదాల జరిగితే పెట్రోల్ బంకు యందు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై వివరించడం జరిగిందన్నారు ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సురేంద్రరెడ్డి,మహమ్మద్ రఫీ,నాగేశ్వర్ రెడ్డి,నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ పాలేటమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- పాల్గొన్న ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి

వేంపల్లె - సూర్య వాస్తవం : వేంపల్లి మండలం ముత్తుకూరు గ్రామం లో నూతనంగా నిర్వ హించిన శ్రీ పాలేటమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా గ్రామ ప్రజలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఉదయస్థమానే ఆలయ ప్రజా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డిని గ్రామ ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎంపీ అవినాష్ రెడ్డికి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అందమైన గ్రామ ప్రజలతో కమిటీ సభ్యులతో సమస్యల గురించి చర్చించారు.

నేటి నుండి "ఒక నెల -- ఒక గ్రామం --నాలుగు సందర్శనలు".

- తహశీల్దార్ ఎన్.క్రాంతి కుమార్

లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం: నేటి నుండి "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లి మండల తహసిల్దార్ ఎన్.క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు గుడ్లవారిపల్లి రెవెన్యూ గ్రామంలో ప్రత్యేక రెవెన్యూ సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి గురువారం ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించి గ్రామస్థుల నుండి వినతులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతమని అన్నారు.ఈ కార్యక్రమంలో భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆదంగల్/1-బీ లోపాలు, వారసత్వ మార్పులు, భూ సర్వే సమస్యలు, ఆక్రమణల ఫిర్యాదులు మరియు ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించబడును అని తెలిపారు.కావున నేడు గుడ్లవారిపల్లిలో జరగబోయే కార్యక్రమంలో గ్రామ ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఆధార పత్రాలతో పాల్గొని, ప్రతి గురువారం ఉదయం 10.00 గంటలకు నిర్వహించే గ్రామ సందర్శన కార్యక్రమంలో హాజరై తమ వినతులను సమర్పించవలసిందిగా కోరారని తెలిపారు.

నితిన్ కొత్త సినిమా మొదలైంది.. హీరోయిన్, దర్శకుడు వీరే!

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నితిన్ కొత్త సినిమా
పూజా కార్యక్రమాలతో వైభవంగా ప్రారంభమైన చిత్రం
సోము నర్రి అనే కొత్త దర్శకుడి పరిచయం
కథానాయికగా రితికా నాయక్ ఎంపిక
ఈ నెల రెండో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్

యంగ్ హీరో నితిన్ తన కొత్త సినిమాను నేడు లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఈ చిత్రం రూపొందనుంది. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్‌ను వైభవంగా మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరయ్యారు.

ఈ సినిమాతో సోము నర్రి అనే కొత్త దర్శకుడు టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. నితిన్ సరసన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందించనున్నారు.

ప్రస్తుతం ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల రెండో వారం నుంచి మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. వరుస విజయాలతో జోరుమీదున్న సితార సంస్థ, ఈ చిత్రంతో నితిన్‌కు ఒక మంచి కమర్షియల్ హిట్ అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. త్వరలోనే సినిమా టైటిల్, ఇతర నటీనటుల పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'

(అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

ప్రదీప్ రంగనాథన్ కి యూత్ లో మంచి క్రేజ్ ఉంది. ఆయన ఎంచుకునే కథలు .. పాత్రలే అందుకు కారణమని చెప్పాలి. ఇంతకుముందు ఆయన చేసిన సినిమాలు 100 కోట్ల మార్కును టచ్ చేయడంతో, సహజంగానే ఆయన తదుపరి సినిమాల పట్ల ప్రేక్షకులకు అంచనాలు పెరిగిపోతూ వచ్చాయి. అలా ఆయన చేసిన సినిమానే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు (మే 6వ తేదీ) నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది.

ఈ కథ 2040లో మొదలవుతుంది. యువత ఎప్పుడూ ప్రేమ వెనుక పరుగులు తీస్తూనే ఉంటుంది. అలాంటి యువత బలహీనతను ఆసరాగా చేసుకుని, సూర్య (ఎస్ జె సూర్య) లవ్ ఇన్సూరెన్స్ కంపెనీని నెలకొల్పుతాడు. యువతీ యువకులకు తన యాప్ ద్వారా ప్రేమించుకుని .. పెళ్లి చేసుకునే ఒక అవకాశాన్ని కల్పిస్తాడు. ఆ యాప్ ను సబ్ స్క్రైబ్ చేసుకుని, తమకి కావలసిన జోడీని సెట్ చేసుకోవచ్చు. పెళ్లి చేసుకోవాలంటే 'లవ్ స్కోర్' ఎక్కువగా ఉండాలి. అది లేకపోతే బ్రేకప్ చెప్పుకోవచ్చు. అలాంటి ఒక యాప్ ను 'దీమా' (కృతి శెట్టి) సబ్ స్క్రైబ్ చేసుకుంటుంది. తనకి తగిన జోడీ కోసం ఆమె సెర్చ్ చేస్తూ ఉంటుంది. అనుకోకుండా ఆమెను చూసిన వాసు (ప్రదీప్ రంగనాథన్) మనసు పారేసుకుంటాడు. 'దీమా'కి చేరువ కావాలంటే తాను ఫోన్ వాడాలి .. సబ్ స్క్రైబర్ కావాలి. కానీ అందుకు అతని తండ్రి ఒప్పుకోడు. మొబైల్ వాడటానికి అతను పూర్తి వ్యతిరేకి. అందుకు ఒక బలమైన కారణం కూడా ఉంటుంది. అయినా తండ్రికి తెలియకుండా అతను ఫోన్ తీసుకుని, దీమాకి టచ్ లోకి వెళతాడు. అలా దీమా .. వాసు మధ్య పరిచయం మొదలై ప్రేమగా మారుతుంది. ఒకానొక సందర్భంలో వాళ్లు తమ లవ్ స్కోర్ చెక్ చేసుకుంటారు. లవ్ స్కోర్ చాలా తక్కువగా ఉండటంతో, వాసూకి దీమా బ్రేకప్ చెబుతుంది. తన ప్రేమలో లోపం లేదనీ, ఆ యాప్ లోనే లోపం ఉందని వాసు భావిస్తాడు. ఆ విషయాన్ని నిరూపిస్తానని సూర్యతో ఛాలెంజ్ చేస్తాడు. ఆ ప్రయత్నంలో అతనికి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేదే కథ.ఇప్పటికే లెక్కలేనన్ని యాప్ లు స్మార్ట్ ఫోన్ లను వెతుక్కుంటూ వస్తున్నాయి. స్మార్టు ఫోన్ ఉంటే చాలు అన్ని రకాల వ్యవహారాలు అందుబాటులో ఉన్నట్టే. అలా ఇద్దరు వ్యక్తుల మధ్య గల ప్రేమను కొలిచే యాప్ కూడా 2040 కాలం నాటికి రావచ్చనీ .. అలాంటి ఒక యాప్ వస్తే ఎలా ఉంటుందనే ఊహకు దృశ్య రూపమే ఈ సినిమా. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' పేరుతో దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు. ఒకప్పటి ప్రేమలు వేరు .. అప్పటి పరిస్థితులు వేరు. కాలం మారిపోయింది .. మనుషులు మారిపోయారు .. ప్రేమకు అర్థాలు – నిర్వచనాలు మారిపోయాయి. ఇప్పటికే విడిపోవడం .. మరిచిపోవడం అనేవి చాలా వేగంగా జరుగుతూ వస్తున్నాయి. 2040 నాటికి యూత్ లైఫ్ స్టైల్ ఎలా ఉంటుంది? ప్రేమికుల ధోరణి ఎలా ఉంటుంది? ప్రేమలు ఎలా ఉంటాయి? అనే ఒక అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. హీరో తన తండ్రికి ఇచ్చిన మాటను పక్కన పెట్టేసి యాప్ వైపు రావడం .. ప్రేమను యాప్ ఎప్పుడూ కొలవలేదని నిరూపిస్తానని విలన్ తో ఛాలెంజ్ చేయడంతో, సెకండాఫ్ పై అందరిలో అంచనాలు పెరుగుతాయి. అయితే తాను అనుకున్నది సాధించడానికి హీరో అనుసరించే మార్గం అంత ఆసక్తికరంగా అనిపించదు. అతను చేసే ప్రయత్నాలు కుతూహలాన్ని రేకెత్తించవు. ఒక చిన్న ఫ్లాష్ బ్యాక్ .. అందుకు సంబంధించిన ఎమోషన్ తప్ప, ఈ కథలో కదిలించే అంశాలేవీ లేవు. ఫస్టాఫ్ లోని కామెడీయే అంతంత మాత్రంగా ఉందనుకుంటే, సెకండాఫ్ లో కామెడీ మరింత బలహీనపడుతుంది. ప్రేమకథలకు ఫీల్ గుడ్ సాంగ్స్ ప్రాణమని చెబుతుంటారు. కానీ 2040 నాటికి పాటలు ఇలాగే అర్థం లేకుండా .. అర్థం కాకుండా ఉంటాయనుకున్నారేమో అలాగే కొనసాగుతూ వెళతాయి. కృతి శెట్టి నటన విషయం పక్కన పెడితే, అంతకుముందు సినిమాలలో మాదిరిగా ఆమెను అందంగా చూపించలేకపోయారు. ప్రదీప్ .. ఎస్ జె సూర్య నటన ఓకే. ఫొటోగ్రఫీ ఫరవాలేదు. బాణీలు పెద్దగా ఆకట్టుకోలేదు. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. మనసులోని ప్రేమ గాఢతను కొలిచే ఒక యాప్ వస్తే ఎలా ఉంటుంది? అనే విఘ్నేశ్ శివన్ ఆలోచన బాగానే అనిపిస్తుందిగానీ, ఆ ఆలోచనకు దృశ్య రూపాన్ని ఇవ్వడంలో ఆయన పూర్తిస్థాయిలో సక్సెస్ కాలేకపోయారని చెప్పాలి. ఒకే పాయింట్ చుట్టూ తిరుగుతూ ఈ కథ ప్రేక్షకుల సహనానికి పరీక్షపెడుతుంది.

పంజాబ్‌పై హైదరాబాద్ ఘన విజయం..

పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి సన్‌రైజర్స్

- 20 ఓవర్లలో 235 పరుగులు చేసిన హైదరాబాద్

- భారీ లక్ష్యంతో బరిలోకి దిగి 202 పరుగులకే కుప్పకూలిన పంజాబ్

- 107 పరుగులతో రాణించిన కూపర్ కానెల్లీ

ఐపీఎల్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఉప్పల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ ఏ దశలోనూ లక్ష్యాన్ని చేధించే ప్రదర్శన కనబరచలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులకే పంజాబ్ కుప్పకూలింది.

పంజాబ్ బ్యాట్స్‌మెన్ కూపర్ కానెల్లి ఒంటరి పోరాటం చేశాడు. 59 బంతుల్లోనే 107 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పంజాబ్ జట్టులో మిగిలిన ఆటగాళ్లు ఎవరూ రాణించలేదు. ఈ గెలుపుతో హైదరాబాద్ పాయింట్ల పట్టికలో పంజాబ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలోకి వచ్చింది. 11 మ్యాచ్‌లకు గాను 7 మ్యాచ్‌లు గెలిచి 14 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. పంజాబ్ కింగ్స్ రెండో స్థానానికి పడిపోయింది.

ప్రపంచ ఛాంపియన్ కు గుకేశ్ ఝలక్

వార్సా(పోలండ్): పోలండ్ వేదికగా జరుగుతున్న ర్యాపిడ్ గేమ్ గ్రాండ్ చెస్ టూర్ లో అంచనాలకు మించి రాణించాడు. ప్రపంచ ఛాంపియన్ అయిన డి. గుకేశ్.. బుధవారం జరిగిన సూపర్ ర్యాపిడ్ బ్రిట్జ్ లో 2026 ప్రపంచ ఛాంపియన్ ఛాలెంజర్ టైటిల్ విజేత జావెఖిర్ సిందరోవ్ ను ఓడించాడు. హోరా హోరీగా సాగిన ఈ గేమ్ లో గుకేశ్ 52 ఎత్తుల తర్వాత విజయం సాధించడం గమనార్హం. సిందరోవ్ 1.4తో గేమ్ ను ప్రారంభించగా.. గుకేశ్ 1.సి6 మూవ్ తో ప్రత్యర్థి ఎత్తుకు పై ఎత్తు వేశాడు. నల్లపావులతో గుకేశ్, తెల్ల పావులతో సిందరోవ్ గేమ్ లను ప్రారంభించారు. ఈ గెలుపుతో గుకేశ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకాడు.

అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్

ధర్మశాల, న్యూ చండీగడ్ లో ప్లేఆఫ్ మ్యాచ్‌లు

ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 19 ఫైనల్, ప్లే--ఆఫ్స్ వేదికలను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) ప్రకటించింది. మే 31న అహ్మదాబాద్‌లో ఈ సీజన్ ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు.. ప్లే ఆఫ్ లో భాగంగా క్వాలిఫయర్-1 మ్యాచ్‌ను ధర్మశాలలో, మరో రెండు ప్లేఆఫ్ మ్యాచ్‌లను న్యూ చండీఘడ్‌లో నిర్వహించనున్నట్లు బిసిసిఐ వెల్లడించింది. 2022, 2023 సీజన్లకు చెందిన ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరిగిన విషయం తెలిసిందే. క్వాలిఫయర్ 1 మ్యాచ్‌ను మే 26న నిర్వహించనున్నారు. లీగ్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ మ్యాచ్‌ను ఆడనున్నాయి. ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనున్నట్లు.. మే 27న మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనున్నట్లు తెలిపింది. ఈ మ్యాచ్ లు న్యూ చండీఘడ్‌లోని నూతన స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇక ఇదే వేదికపై మే 29న క్వాలిఫయర్ 1 మ్యాచ్ జరగనుంది.



అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు మరో అవార్డు

- స్థాపించిన ఏడాదిలోనే రాష్ట్రం స్థాయి గుర్తింపు
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అవార్డు ప్రదానం
- జే.ఎన్.టీ.యూ వీసీ నుంచి అవార్డు అందుకున్న డాక్టర్ గుజ్జుల హేమలత

అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం : అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు మరో అవార్డు దక్కింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు, ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ గురూజీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో అనంతపురం జే.ఎన్.టీ.యూలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కూ అవార్డు ప్రకటించారు. అవార్డ్ ను ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జుల హేమలతకు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జే.ఎన్.టీ.యూ వీసీ చేతుల మీదుగా ఆమెకు అవార్డు బహూకరించారు.

ఏడాదిలోనే రాష్ట్ర స్థాయి గుర్తింపు

అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయింది. ఏపీలో మొత్తం మూడు మిల్క్ బ్యాంక్ లు ఉండగా.. అందులో అనంతపురంలోని అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ విజయవంతంగా కొనసాగుతూ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. స్థాపించిన సంవత్సర కాలంలోనే ఇప్పటి వరకు తల్లిపాల ప్రాధాన్యం, దానం గురించి 35 వేల మంది తల్లులకు అవగాహన కల్పించారు. 3500 మంది తల్లుల నుంచి సుమారు 550 లీటర్ల పాలు సేకరించారు. వాటిని 3,200 మంది పిల్లలకు తల్లులు దానం చేసిన పాలను అందించి ఊపిరి పోశారు. అనంత మదర్స్ మిల్క్ ఇంత పెద్ద స్థాయిలో గుర్తింపు పొందడం వెనుక కీలక పాత్ర పోషించిన డాక్టర్ హేమలత, నోడల్ ఆఫీసర్లు పీడియాట్రిషియన్ డాక్టర్ హరిణి, డాక్టర్ రాధిక, స్టాఫ్ నర్సులు సునీత, మానస, బోయ సుకన్య, హైమావతి, రమాదేవి, కౌన్సిలర్లు పల్లవి, రాధ, ఎం.ఎన్.ఓలు వెంకటసాయి, వెంకట నారాయణ కృషి మరువలేనిది. అసలు అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ ఆలోచన వచ్చిన వెంటనే అమలు చేసిన డాక్టర్ హేమలతకు ఈ సందర్భంగా అవార్డు అందజేసి, ఆమె కృషిని ప్రశంసించారు.

ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్లు పంపిణీ....!

అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం : అనంతపురం ట్రాఫిక్ పోలీసులకు వేసవి సురక్షిత ఉపకరణలు అందజేసారు జిల్లా ఎస్పీ పి.జగదీష్. సుమారు 100 మంది సిబ్బందికి కూల్ కళ్లద్దాలు, లీటర్ వాటర్ బాటిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, క్యాప్, తదితర ఉపకరణలు కల్గిన కిట్లను జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ తన ఛేంబర్లో పంపిణీ చేశారు.మండుటెండలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది సంక్షేమం కూడా ముఖ్యం... వేసవిలో వడదెబ్బకు గురికాకుండా, వేడి బారినకుండా ఈ సురక్షిత ఉపకరణలు దోహదం చేస్తాయని తెలిపారు. ఎండ వేడి మికి తట్టుకునేలా సిబ్బందికి వేసవి సురక్షిత ఉపకరణలు అందజేయడానికి సహకరించిన దాతలు కిమ్స్ సవీరా హాస్పిటల్ సురేంద్రరెడ్డి, సహేబా జగదీష్ , రూపాలి గిఫ్ట్, నాపల్టీస్ అనీల్‌లకు కృతజ్ఞతలు తెలియజేసి సన్మా నించారు.

ఈ కార్యక్రమంలో అనం తపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సి.ఐవెంకటేష్ నాయక్, అనం తపురం కిమ్స్ సవీర హాస్పిటల్ నిర్వాహకులు సురేంద్రరెడ్డి, సహేబా జగదీష్, రూపాలిఅనీల్, తది తరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతుల దుస్థితి...

- వెంటనే ఆదుకోవాలి: బీజేపీ డిమాండ్
- ఐకేపీ సెంటర్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం పై ఆగ్రహం
- వర్షాలకు ధాన్యం నష్టపోయినా రక్షణ చర్యలు లేవని విమర్శ
- నెల రోజులుగా కొనుగోలు లేక రైతుల పడిగాపులు
- తేమశాతంతో సంబంధం లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్
- మరిన్ని వర్షాలకు ముందే కాంటాలు ఏర్పాటు చేయాలని హెచ్చరిక

మహాదేవపూర్ - సూర్య వాస్తవం: మహాదేవపూర్ మండల కేంద్రం లోని ఐకేపీ సెంటర్ ను బీజేపీ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ చందుపట్ల సునీల్ రెడ్డి మరియు బీజేపీ నాయకులు సందర్శించారు అనంతరం వారు మాట్లాడుతూ గత సంవత్సరం కూడా మహాదేవపూర్ మండల కేంద్రం లో ఐకేపీ సెంటర్ ను చెరువులో నిర్వహిస్తే రైతులు అందరు చాలా వరకు నష్టపోవడం జరిగింది ఈ సంవత్సరం కళాశాల గ్రౌండ్ లో సెంటర్ నిర్వహిస్తే ఆ ప్రాంగణం లో భారీ వర్షం పడితే వరద వెళ్ళడానికి మార్గం లేదని తెలిసి కూడా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు, అధికారుల నిర్లక్ష్యం వాళ్ళ నష్ట పోయిన రైతులందరిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు, ధాన్యం నిల్వలు ఉన్న మార్కెట్ లో ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యం, నెల రోజులుగా రైతులు మార్కెట్లో పడిగాపులు కాస్తున్న ఎందుకు కాంటాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరించిన కూడా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వదలడం లేదని రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు వలన రైతులు మరింత నష్టం చవి చూడకముందే వెంటనే కాంటాలు ఏర్పాటుచేసి తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని బిజెపి పార్టీ పక్షాన డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, మాజీ మండల అధ్యక్షులు శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి లింగంపెల్లి వంశీ, వార్డ్ మెంబెర్ సొన్నారి శ్యామ్, మండల నాయకులు కన్నీబోయిన అయిలన్న, యువమోర్చ నాయకులు వెంకటేష్, జోగేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం...

- రోడ్డు దాటుతుండగా వ్యక్తి దుర్మరణం
- అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణమా?
- గుర్తుతెలియని వాహనం ఢీకొని ఘటన స్థలంలోనే మృతి
- ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు అవసరమని స్థానికుల ఆవేదన

పెళ్లకూరు- సూర్య వాస్తవం: నాయుడుపేట -- పూతలపట్టు 6 లైన్ల జాతీయ రహదారి మరోసారి ప్రాణాలను బలి తీసుకుంది. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఎగువ చావలి గ్రామ సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోళ్ళ రాంబాబు (50) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆయన రాత్రి సమయంలో రోడ్డు దాటి ఆవలి వైపు వెళ్తుండగా, నాయుడుపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ఢీకొట్టడం తీవ్రంగా ఉండటంతో రాంబాబు శరీర అవయవాలు అస్తవ్యస్తమై, ఘటన స్థలంలోనే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందుకున్న పెళ్లకూరు పోలీసులు, హైవే పోలీస్ షేక్ రఫీ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం గుర్తించేందుకు ప్రత్యేకంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనను చూసిన స్థానికులు గగుర్పాటుకు గురయ్యారు. మృతుడికి భార్య, వివాహమైన కుమార్తె ఉన్నట్లు తెలిసింది. జాతీయ రహదారిపై తరచుగా జరుగుతున్న ప్రమాదాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, వేగ నియంత్రణ చర్యలు, సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటే మరిన్ని ప్రాణాలు కాపాడవచ్చని వారు అభిప్రాయపడ్డారు.

మడుగుతేరు (రథోత్సవం)లో పాల్గొన్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ - సూర్య వాస్తవం: పెన్నహోబిళం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక , ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకి ఆలయ ఈఓ, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకి సేవలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆశేష జన సందోహం మధ్య మడుగుతేరు (రథోత్సవం)లో మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, జనసేన ఇంచార్జి గౌతమ్ కుమార్‌తో పాటు మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు దేవేంద్ర, నాయకులు రమేష్, మణి కుమార్, వంశీ, అనిల్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పగడాలమ్మ చల్లగా చూడమ్మ

- పగడాల పల్లె గంగమ్మకు సాయినాథ్ శర్మ పూజలు
- సాయినాథ్ శర్మకు ఘన స్వాగతం
- పలికిన అభిమానులు ఆత్మీయులు

కమలాపురం - సూర్య వాస్తవం : వైయస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలం పగడాల పల్లె శ్రీ గంగమ్మ తల్లి తిరునాళ్ల కార్యక్రమంలో వైసిపీ రాష్ట్ర ఎస్.ఈ.సి సభ్యుడు కాశీభట్ల సాయినాథ్ శర్మ పాల్గొని పూజలు నిర్వహించారు పెండ్లిమర్రి మండలంలోని తన అభిమానుల ఆత్మీయుల ఆహ్వాన మేరకు సాయినాథ్ శర్మ బుధవారం మధ్యాహ్నం గంగమ్మ తిరుణాలకు విచ్చేశారు.ఈ సందర్భంగా తిరునాళ్లకు విచ్చేసిన సాయినాథ్ శర్మ కు ఆయన అభిమానులు ఆత్మీయులు బాణాసంచ పేల్చుతూ తప్పెట్లు వాయిస్తూ ఘన స్వాగతం పలికారు. తిరునాళ్ల సందర్భంగా యారసుపల్లె, కొనాయపల్లె గ్రామ వాసుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా సాయి నాథ్ శర్మ విచ్చేసి తన అభిమానులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాయినాథ్ శర్మ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా కోనాయిపల్లి, యారాసు పల్లె గ్రామస్తులు తిరుణాల సందర్భంగా అమ్మవారి మీద భక్తితో తిరునాళ్లకు విచ్చేసే భక్తుల ఆకలి దప్పులు తీర్చడానికి చిత్తశుద్ధి తో మంచి మనసుతో అన్నదానం చేస్తుండడం చాలా అభినందనీయం అన్నారు.అన్నదాన కార్యక్రమంలో తనను పాల్గొనేలా చేసిన తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెండ్లిమర్రి మండల సాయినాథ్ శర్మ అభిమానులు ఆత్మీయులు వైసిపి నాయకులుభారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన వైకాపా నాయకులు

పులివెందుల - సూర్య వాస్తవం : పులివెందులలోని విజయ గార్డెన్లో బుధవారం జరిగినటువంటి పో రెడ్డి కుటుంబ సభ్యుల వివాహానికి వైకాపా నాయకులు హాజరై వధూవరులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాలలో భాగ ంగా వైకాపా విద్యార్థి విభాగం నాయకుడు పోరెడ్డి జస్వంత్ రెడ్డి తమ్ముడు ఆయనటువంటి యశ్వంత్ రెడ్డి చందన ల వివాహ వేడుకలు అత్యంత వైభవంగా జరగగా వైకాపా నాయకులు ప్రతాప్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైకాపా పులివెందుల పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోడి రమణ, వైకాపా పట్టణ ఉపాధ్యక్షుడు పార్లపల్లె కిషోర్, శ్రీనివాసులు రెడ్డి మరియు ఇతర వైకాపా శ్రేణులు హాజరై వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివాహ బంధుమిత్రులు వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 (ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad)